సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 4 । జూన్ । 2023



క్షమాపణ చెప్పాలి
తుంగతుర్తి నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలు జరుగుతున్నాయని మంద కృష్ణమాదిగ ఆరోపించారు. - 10లో



దేశానికి అన్నం పెడుతున్న తెలంగాణ
వరి సాగులో దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందని కంచర్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
42° / 27°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు సురక్ష దినోత్సవం



విద్యుత్ దీపాల అలంకరణలో డీసీపీ కార్యాలయం

భువనగిరిటౌన్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సురక్ష దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ పెట్రోలింగ్ కార్లు, బ్లూ కోల్ట్ వాహనాలతో హెడ్ క్వార్టర్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో పోలీసులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొనున్నారు.

రేపు ప్రజావాణి రద్దు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యంత్రాంగం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో నిమగ్నమై ఉండడం వల్ల ప్రజావాణిని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మురళీమోహన్

భువనగిరిటౌన్ : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మురళీమోహన్ పేర్కొన్నారు. మహిళా హక్కులు, పారా లీగల్ వలంటీర్ల విధి విధానాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భువనగిరిలోని సీడీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు.నిరక్షరాస్యులకు, నిరుపేదలకు న్యాయ సేవా సంస్థల ద్వారా న్యాయ సేవా సహకారం అందించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం భువనగిరి రైతు వేదికను సందర్శించి అందులో ఏర్పాటు చేసిన వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ స్వరాజ్యం, న్యాయ సేవాధికార సంస్థ అధికారిక షార్ట్ ఫిలిం దర్శకులు, సలహాదారు సాయిప్రసాద్ పాల్గొన్నారు.

పండుగలా వ్యవసాయం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

బొమ్మలరామారం : బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా మారిందని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం బొమ్మలరామారం మండలంలోని మర్యాల, చీకటిమామిడి, మల్యాల, మైలారం రైతువేదికల్లో నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల ఉన్నతి కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుబంధు, రైతుబీమా, మిషన్ కాకతీయ, ఉచిత కరెంట్ వంటి పథకాలతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మచ్చ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ పద్మ సుందరి, ఎంపీడీఓ సరిత, వైస్ ఎంపీపీ శోభ చంద్రమౌళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుషంగల సత్యనారయణ, పీఏసీఎస్ చైర్మన్ బాల్ నర్సింహ, వైస్ చైర్మన్ కొండల్‌రెడ్డి, ఏట పద్మ, సర్పంచ్‌లు మచ్చ వసంతాశ్రీనివాస్‌గౌడ్, కుర్మిండ్ల దామోదర్‌గౌడ్, వడ్లకొండ అరుణ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్ : హైదరాబాద్ కాచిగూడలోని మున్నూరుకాపు వసతి గృహంలో వసతి పొందేందుకు హైదరాబాద్‌లో ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యాభ్యాసం చేస్తున్న జిల్లాకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులను వసతిగృహం ట్రస్ట్‌బోర్డు కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 040–24658160, 9491627404 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గ్రామ రక్షణలో యువత!

నేరాల నియంత్రణకు రాచకొండ పోలీసుల వ్యూహం
- ప్రతి ఊరిలో ఐదు నుంచి పది మందితో వలంటీర్ వ్యవస్థ
- రాత్రి వేళల్లో పోలీసులతో కలిసి గస్తీ
- రోజువారీ కార్యక్రమాలు ప్రత్యేక వాట్సాప్‌లో పోస్టు
- ఎప్పటికప్పుడు డీసీపీ పర్యవేక్షణ



రాజాపేట మండలం పారుపల్లిలో కానిస్టేబుల్‌తో కలిసి గస్తీ నిర్వహిస్తున్న యువకులు

రాజాపేట : జిల్లాలో కొంతకాలంగా దొంగలు రెచ్చిపోతున్నారు. అటు పోలీసులకు, ఇటు జనానికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. పెద్ద ఎత్తున నగదు, ఆభరణాలు దోచుకెళ్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న దోపిడీలు, దొంగతనాలను అరికట్టడం పోలీసులకు కత్తిమీద సాములా మారింది. ఎలాగైనా నియంత్రించేందుకు రాచకొండ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లో విలేజ్ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. దీంతో యువత పెడదారి పట్టకుండా ఉండడంతో పాటు వారిని నేర నియంత్రణలో భాగస్వాములను చేసినట్లు అవుతుందని పోలీస్ యంత్రాంగం భావిస్తోంది. ఇప్పటివరకు జిల్లాలోని 80శాతం గ్రామాల్లో వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. వలంటీర్లు మండల స్థాయిలో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి గురుతర బాధ్యతగా గ్రామ రక్షణలో పోలీసులకు సహాయ, సహకారాలు అందజేస్తున్నారు. రోజూ జరుగుతున్న కార్యక్రమాలను గ్రూపులో పోస్టు చేస్తుంటారు. పోలీసు యంత్రాంగం చేస్తున్న కృషి ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపుతోంది.

వలంటీర్ల బాధ్యతలు ఇవీ..
గ్రామాల్లో దొంగతనాలు, తదితర నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 45 సంవత్సరాల లోపు వయస్సుగల యువకులు ఐదు నుంచి 10 మందితో ఏర్పాటు చేసిన సమూహమే వలంటీర్ వ్యవస్థ. గ్రామాల్లో ఉన్న వార్డులను బట్టి వంతుల వారీగా వలంటీర్లు గస్తీలు నిర్వహిస్తున్నారు. వీరంతా అపరిచితులను, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల కదలికలను పరిశీలిస్తూ రాత్రి 10నుంచి ఉదయం 5 గంటల వరకు గస్తీ నిర్వహిస్తారు. డీసీపీ పర్యవేక్షణలో పని చేసే ఈ వలంటరీ గ్రూపులకు పోలీసు కానిస్టేబుల్ లేదా హోంగార్డు మార్గదర్శిగా వ్యవహరిస్తారు. భువనగిరి జోన్ పరిధిలో దాదాపు 80శాతం గ్రామాల్లో వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు పూర్తయ్యింది. ప్రస్తుతం కొనసాగుతున్న వ్యవస్థను స్ఫూర్తిగా తీసుకుని మిగతా యువకులు కూడా గ్రామ రక్షణలో భాగస్వాములం అవుతామంటూ ముందుకు వస్తున్నారు. వీరికి స్థానిక ప్రజాప్రతినిధులు సైతం సహకరిస్తున్నారు.

ధైర్యంగా ఉంది



గ్రామాల్లో కొంతకాలంగా దొంగతనాలు పెరిగిపోయాయి. కంటిమీద కునుకులేకుండా పోతుంది. చోరీలు, ఇతర నేరాల నియంత్రణకు పోలీసు యంత్రాంగం గ్రామాల్లో యువతను భాగస్వామ్యం చేస్తూ వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. పోలీసులతో కలిసి రాత్రివేళలో గస్తీ కాయడానికి యువత కూడా ఉత్సాహం చూపుతుంది. దీంతో ప్రజలకు ఎంతో ధైర్యం ఉంటుంది.
–మార్క శివ, నెమిల, రాజాపేట మండలం

కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలి



గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే సమాచారం ఇవ్వాలి. మహిళలు ఒంటరిగా వెళ్లేటప్పుడు ఆభరణాలు ధరించవద్దు.ఆరుబయట నిద్రిస్తున్న సమయంలోనూ ఆభరణాలు ధరించవద్దు. ఎవరైనా మాదకద్రవ్యాలు వాడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. దొంగతనాల నియంత్రణకు గ్రామాల్లో యువకులతో వలంటరీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నాం. వారంతా గ్రామాల్లో గస్తీ తిరుగుతూ పోలీసులకు సహకరిస్తున్నారు.
–సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ, రాజాపేట

రాష్ట్ర సంపదను పెంచడంలో రైతులే కీలకం



రైతు దినోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, చిత్రంలో కలెక్టర్ పమేలా సత్పతి, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ప్రజాప్రతినిధులు

- పంటల సాగు విస్తీర్ణం ఎంతో పెరిగింది
- ప్రభుత్వం చేపట్టిన చెరువుల అభివృద్ధి, ప్రాజెక్టులతోనే ఇది సాధ్యమైంది
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

భూదాన్‌పోచంపల్లి: రాష్ట్ర సంపదను పెంచడంలో రైతులది కీలక భూమిక అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. తెలంగాణలో వ్యవసాయం ఒక పండుగ జరగాలని సీఎం కేసీఆర్ కలలుగన్నారని, ఇక్కడి వచ్చిన తరువాత చూస్తే సీఎం కల నిజమైందని అన్నారు. శనివారం భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం క్లస్టర్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన రైతు దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 30 ఏళ్ల క్రితం సబ్‌డివిజన్‌గా ఉన్న భువనగిరిలో తాను సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించానని గుర్తుచేసుకొన్నారు. నాడు వేసవిలో జీపులో ఎంతదూరం వెళ్లినా ఈ ప్రాంతమంతా బీడు భూములు, మొదుగు చెట్లే కనిపించేవని, వానాకాలంలో కూడా ఆముదాలు వేసేవారిని చెప్పారు. నేడు పోచంపల్లికి వస్తుంటే.. పచ్చదనం, చెరువుల్లో నీళ్లు, పంటపొలాలతో గుర్తు పట్టలేనంతగా మారిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. దీనంతటికి కారణం ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్, చెరువుల అభివృద్ధి, ప్రాజెక్టుల వలన సాధ్యమైందని అన్నారు.

ధాన్యం దిగుబడిలో జిల్లా ముందంజ
ధాన్యం దిగుబడిలో యాదాద్రి భువనగిరి జిల్లా ముందంజలో ఉందని చీఫ్ సెక్రటరీ శాంతికుమారి అన్నారు. జిల్లాలో వానాకాలంలో 4.50 లక్షల ఎకరాలు, వేసవిలో 3.10 లక్షల ఎకరాలలో వరిసాగవుతుండటం గొప్ప విషయమని అన్నారు. పెరిగిన దిగుబడితో మిల్లులు, గిడ్డంగులు సరిపోవడంలేదని చెబుతుంటే నమ్మశక్యంగా లేదన్నారు. రైతుల కళ్లలో ఎంతో ఆనందం కన్పిస్తుందని పేర్కొన్నారు. వానాకాలం సీజన్‌కు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నామని ఆమె చెప్పారు.

ఐదు సూత్రాలు పాటించాలి
జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగినా, అందుకగుణంగా పంట దిగుబడి మాత్రం పెరగలేదని, పంట దిగుబడికి ప్రతి రైతు ఐదు సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి అన్నారు. ముఖ్యంగా పచ్చిరొట్ట ఎరువులు వాడాలని, విత్తనాలను నేరుగా వెదజల్లే పద్ధతులు పాటించాలని, పీఎస్‌బీ వాడకం, ట్రైకో డెర్మా వాడాలని, దఫదఫాలుగా ఎరువులు వేయాలని సూచించారు. అంతేకాకుండా ప్రకృతివైపరీత్యాలు, వడగండ్ల వర్షాలతో పంట నష్టపోకుండా ఉండాలంటే రైతులు పంటలకాలాన్ని మూడు వారాల ముందుకు జరపాలని, జూన్ నెలాఖరు వరకు నాట్లు వేసుకోవాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఇటీవల కలెక్టర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఇదే విషయం చెప్పారని గుర్తు చేశారు.

రూ.250 కోట్లు విడుదల
కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యానికి సంబంధించి జిల్లాకు రూ.250 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని, మరో రూ.400 కోట్లు రానున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామని, ఇప్పటి వరకు 3,00,700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. మూసీ పరీవాహక మండలాల్లో పా రాబాయిల్డ్ రైస్ ఎక్కువ వస్తుందన్నారు. 12,300 మెట్రిక్ టన్నుల పారాబాయిల్డ్ రైస్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని, మరో 20వేల మెట్రిక్ టన్నుల కోసం లేఖ రాసినట్లు వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, డీసీపీ రాజేశ్‌చంద్ర, ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



మాసాయిపేటలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట రైతు వేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాక రైతు రాజు అవ్వాలన్న ఉద్దేశంతో ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టేందుకు మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించినట్లు తెలిపారు. స్వరాష్ట్రంలో సాగు నీటి వనరులు పెరిగాయని, రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. 2014సంవత్సరానికి ముందు యాదాద్రి భువనగిరి జిల్లాలో 2లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 7 లక్షల ఎకరాలకు పెరిగిందన్నారు. గతంలో ఎరువుల కోసం రైతులు బారులు తీరేవారని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ అందజేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. విత్తనాలు మొదలుకొని కల్లాల వద్ద వడ్లు కొనుగోలు చేసేవరకు ఏ సమస్య రాకుండా సీఎం కేసీఆర్ రైతులను చూసుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల కోసం రైతుబీమా, రైతు బంధు, వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ పథకాలు అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతులకు పంట రుణాలు మాఫీ చేశారని, స్థానికంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆలేరు నియోజకవర్గంలో నాబార్డు నిధులతో 48 చెక్ డ్యాంలు నిర్మించామని, భూగర్భ జలాలు ఎంతో అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. అనంతరం రైతులతో ముచ్చటించారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందిన వారితో మాట్లాడి సంతోషం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు తోటకూరి అనురాధ, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మండల వ్యవసాయాధికారి రాజేష్‌కుమార్, ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి, శ్రీ లొగిల్లు చైర్మన్ వంటేరు సురేష్‌రెడ్డి, సర్పంచ్‌లు వంటేరు సువర్ణ, తోటకూరి బీరయ్య, కానుగు కవిత, బీర్ల శంకర్, మొగిలిపాక తిరుమల, కుండె పద్మ, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ మిట్ట వెంకటయ్య, స్పెషల్ ఆఫీసర్ చందన, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఇక ఆలయ ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన చేపట్టారు. ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ తదితర కైంకర్యాలు గావించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.



పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు

గీత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

సంస్థాన్ నారాయణపురం : గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రానికి చెందిన నీళ్ల నరసింహగౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థికసాయంగా కల్లుగీత కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.25వేల చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదానికి గురై మృతి చెందిన గీత కార్మికులను ఆదుకునేందుకు గీతన్న బీమా ద్వారా ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థికసాయం అందించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తుందన్నారు.



చెక్కు అందజేస్తున్న పల్లె రవికుమార్

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వీరమళ్ల భానుమతి, వెంకటేష్, సుర్వి యాదయ్య, చెరుకు లింగం, సత్తయ్య, యాదయ్య, యాదగిరి, లింగస్వామి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి



రాయగిరిలో రైతు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్ : రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు న్యాయం కోసం రోడ్డెక్కితే అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టడం శోచనీయమని డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. నాన్ బెయిలబుల్ కేసులతో జైల్లో ఉన్న రాయగిరికి చెందిన పలువురు రైతుల కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాశం శివానంద్, చిక్కుల వెంకటేష్, పక్కీర్ కొండల్‌రెడ్డి, నానం కృష్ణ, సుక్క స్వామి, విరల్ వెంకటేశం, ఎడ్ల శ్రీను ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



రైతువేదికను ప్రారంభిస్తున్న గొంగిడి సునీత

మోటకొండూర్ : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని, స్వరాష్ట్రంలో రైతుల దశ మారిపోయిందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మోటకొండూరు మండలంలోని చాడ క్లస్టర్ రైతు వేదికను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రైతు దినోత్సవంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ వంటి పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వమే రైతులకు శ్రీరామ రక్ష.. ఆ ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత రైతులపై ఉందన్నారు. బీఆర్ఎస్ అమలు చేస్తున్న పథకాలను రైతులకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అంతకుముందు ఆమె ఎడ్ల బండ్లతో ర్యాలీగా రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీఓ పరిమళాదేవి, డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, జెడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, సర్పంచ్ మల్గ ఎట్టమ్మ, ఏడీఏ పద్మ, ఏఓ సుజాత, ఎంపీటీసీ చాడ ప్రతిభారెడ్డి, గంధమల్ల జహంగీర్, మంత్రి రాజు, పైళ్ల వినోద, కొప్పుల మమత, వేముల పాండు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అధికంగా చేర్పిస్తే సన్మానం!

డీఈఓ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఆఫర్
- ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్ల పెంపుపై దృష్టి
- మొదలైన బడిబాట
- ఈనెల 17వరకు కార్యక్రమాలు



రాజాపేట మండలం పుట్టగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, చిన్నారులు

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, అడ్మిషన్లు పెంచడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసారి విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎక్కువ మంది విద్యార్థులను నమోదు చేసిన డీఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం తరఫున సన్మానం చేయనున్నారు. ఈనెల 17వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఈసారి స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్
సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడం, బడీడు పిల్లలంతా బడిలో ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. అయితే ఈ విద్యా సంవత్సరం బడిబాట కార్యక్రమాన్ని రెండు విభాగాలుగా విభజించారు. 3నుంచి నుంచి 9వ తేదీ వరకు కేవలం అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత 12 నుంచి17వ తేదీ వరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు ఉంటాయి. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ఉదయం 7నుంచి 11 గంటల వరకు ఇంటింటికి వెళ్లి ప్రచారం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన తదితర విషయాలపై ప్రచారం చేయాలి. అంతేకాకుండా ర్యాలీలు నిర్వహించి, కరపత్రాల పంపిణీ చేయనున్నారు. ఇందులో ఇంగ్లిష్ మీడియం చదువు, మన ఊరు – మన బడి వంటి కార్యక్రమాల గురించి వివరించనున్నారు. బాల కార్మికులు, బడి బయట ఉన్న చిన్నారులను నమోదు చేయనున్నారు.

జిల్లాలో 712 పాఠశాలలు
జిల్లాలో 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 55,847 మంది విద్యార్థులు ఉన్నారు.

చేపట్టే కార్యక్రమాలు ఇలా..
- ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు పాఠశాలల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రవేశాల స్వీకరణ
- 12న మన ఊరు –మన బడి, మన బస్తీ – మన బడి కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన.
- 13న తొలిమెట్టు తదితర అంశాలపై చర్చ
- 14న చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, బాల సభలు
- 15న చిన్నారులు, బడిబయట ఉన్న విద్యార్థుల నమోదు
- 16న ఇంగ్లీష్ మీడియంపై అవగాహన
- 17న బాలికల విద్య, భవిష్యత్‌పై అవగాహన కల్పించనున్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం
జిల్లాలో శనివారం నుంచి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఈసారి బడిబాట రెండుగా విభజింపబడింది. మొదటి భాగంలో ఎన్‌రోల్‌మెంట్, రెండో భాగంలో వివిధ కార్యక్రమాలు ఉంటాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించాం. బడిబాట కార్యక్రమం ఈనెల 17వ తేదీ వరకు కొనసాగుతుంది. బడీడు, బడి బయట ఉన్న చిన్నారులను బడికి రప్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి.
–ప్రశాంత్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ ఏడీ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

తిరుమలగిరి (తుంగతుర్తి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. తిరుమలగిరి, గుర్రంపోడు, నార్కట్‌పల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా పెద్దవంగర మండలం కొడిపల్లి గ్రామానికి చెందిన తేలుకుంట్ల స్వరూప (25)భర్త నరేష్ పిల్లలతో కలిసి తిరుమలగిరి నుంచి తొర్రూరు రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో తొండ గ్రామ శివారులో లారీ వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొట్టడంతో స్వరూప అక్కడికక్కడే మృతిచెందగా నరేష్, ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి..

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలుకు చెందిన కొంగర లక్ష్మయ్య(39) శనివారం బైక్‌పై ఆరేగూడెం స్టేజి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు గ్రామంలో వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

ఆటో బోల్తా పడి..

నార్కట్‌పల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలం వెల్లి గ్రామానికి చెందిన మరెడ్డి రాజేష్ (22), గోగుల సాయిరామ్ (22) నర్సరీ మొక్కల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో భాగంగా ట్రాలీ ఆటోలో ఐరన్ సెంట్రింగ్ లోడ్‌తో శనివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆటో వెనుక టైరు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాజేష్, సాయిరామ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

వడదెబ్బతో ఒకరు మృతి

మిర్యాలగూడ అర్బన్: వడదెబ్బతో ఒక వ్యక్తి మృతి చెందాడు. మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన ఉబ్బపల్లి మహేష్(40) భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం కూలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.

ఆదాయమున్నా సౌకర్యాలు సున్నా

- సాగర్‌లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు కరువు
- లాంచీల కోసం వేచి చూసే దగ్గర ఏర్పాటు చేయని స్టేషన్
- వాష్‌రూమ్స్ లేకపోవడంతో అవస్థలు
- విజయవిహార్ ప్రాంగణంలో కోతులు, వందుల సంచారం



పాత లాంచీస్టేషన్ సమీపంలో వృథాగా ఉన్న మొబైల్ వాషింగ్ రూమ్ వాహనం



లాంచీస్టేషన్, హోటల్ నిర్మాణం చేసే స్థలం

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థకు ఆదాయం ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. హోటల్, అతిథి గృహం గదుల అద్దెలే టీఎస్‌టీడీసీకి నెలకు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల మేర ఆదాయం వస్తుంది. లాంచీలతో వచ్చే ఆదాయం అదనంగా ఉంటుంది. గతంలో 24గంటల పాటు ఉండే సెక్యూరిటీని కూడా ప్రస్తుతం తొలగించారు. సాగర్‌లో బుద్ధవనంను మినహాయిస్తే ఎక్కడా రూపాయి ఖర్చు లేదు. అయినా ఎక్కడా అభివృద్ధి కానరావడం లేదని విమర్శలున్నాయి. పర్యాటకులు లాంచీల కోసం వేచి చూసే దగ్గర లాంచీ స్టేషన్ నిర్మాణం చేయలేదు. దీంతో పర్యాటకులు ఎండలోనే కిలోమీటరు దూరం నడిచి అక్కడ జలాశయతీరంలో వేచిచూడాల్సి వస్తుంది. అక్కడ కనీసం వాష్‌రూములు ఏర్పాటు చేయకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి దారుణంగా ఉంది. అంతేకాకుండా విజయవిహార్ ప్రాంగణంలో కోతులతో పాటు పందులు స్వైరవిహారం చేస్తుంటాయి.

హోటల్ ఏర్పాటుకు నదీతీరంలో స్థలం..

పర్యాటకులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, పాత లాంచీస్టేషన్ దగ్గర ఉన్న వాషింగ్ మొబైల్ వాహనాన్ని నదీతీరం వద్ద పెట్టాలని కోరుతున్నారు. నదీతీరంలో ఉన్న లాంచీ స్టేషన్ వద్ద పర్యాటకులకు ఆహారపదార్థాలు అందుబాటులో ఉంచేందుకు హోటల్ ఏర్పాటు చేసేందుకు స్థలం ఉంది. అక్కడ హోటల్ ఏర్పాటు చేస్తే పర్యాటకులు లాంచీలు వచ్చేంతవరకు అందులో సేదతీరేందుకు అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అదేవిధంగా టికెట్స్ ఇచ్చేందుకు బుకింగ్ కౌంటర్, వాషింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని చెబుతున్నారు.

> **సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా**
>
> నాగార్జునసాగర్‌లో పర్యాటకులకు నెలకొంటున్న సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా. సమస్యలు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునేవిధంగా వారికి విన్నవిస్తాం.
>
> – సైదులు, లాంచీమేనేజర్

క్యాన్సర్‌కు మనోధైర్యమే మందు

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: క్యాన్సర్‌కు మనోధైర్యమే మందు అని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కేన్సర్‌తో బాధపడుతూ సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సంక్రమిత వ్యాధుల విభాగం పాలియేటివ్ కేర్‌లో చికిత్స పొందుతున్న ధరావత్ స్వాతి కోరిక మేరకు శనివారం మంత్రిని తీసుకొచ్చి ఆమెకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబానికి ఆయన మనోధైర్యం అందించారు. వారితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో దిగారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో వైద్య సౌకర్యాలు కార్పొరేట్ స్థాయికి వచ్చాయని, తెలంగాణ ఏర్పడ్డాక వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఎంతో బిజీగా ఉన్నా క్యాన్సర్ బాధితురాలి కోరిక మేరకు ఆమెను కలిసి ఓదార్చినందుకు మంత్రికి వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలియేటివ్ కేర్ వైద్యాధికారి డాక్టర్ షష, ఫిజియో థెరపిస్టు శ్వేత, త్రివేణి, వాణి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్ బాధితురాలు స్వాతి కుటుంబ సభ్యులతో మంత్రి జగదీశ్‌రెడ్డి

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

- నల్లగొండ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నకిరేకల్ : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వ్యవసాయ పథకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవాల్లో భాగంగా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు వేదిక భవనాన్ని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ప్రారంభించారు. తొలుత చందుపట్ల గ్రామస్తులు ట్రాక్టర్‌లు, ఎడ్లబండ్లు, మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైతు వేదిక భవనంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ అవతరణ దినోత్సవాల్లో భాగంగా గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు అంతకు ముందు ఉన్న పరిస్థితులను పరిశీలన చేసుకోవాలని చెప్పారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ రైతులకు పెట్టుబడుల కోసం గతంలో అప్పులు తెచ్చి అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునేవారని, నేడు ఆ పరిస్థితి లేకుండా రైతుబంధు ప్రవేశపెట్టి వారికి సహాయం అందించడం గొప్పవిషయమని తెలిపారు.

యాదాద్రిలో మంత్రి, అధికారుల పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్‌లకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

బావను హత్య చేసిన బావమరిది

- సుత్తెతో తలపై మోది ఘాతుకం
- భూమి ఇవ్వడం ఇష్టం లేకనే దారుణం
- పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఘటన



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

పెద్దఅడిశర్లపల్లి : బావమరిది చేతిలో బావ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలం మొసంగి గ్రామానికి చెందిన మిడసనమెట్ల సాయన్న తన కూతురు పారిజాతను నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మారడుగుల గ్రామానికి చెందిన చౌట ఆంజనేయులుకి (35)ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో తనకున్న రెండు ఎకరాల్లో కూతురికి ఎకరం భూమి ఇచ్చాడు. అంజనేయులు తన భార్య పారిజాతతో కలిసి హైదరాబాద్‌లో పేయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, కొడుకు వెంకటయ్య తాగి వ్యసనాలకు అలవాటు పడుతున్నాడని ఉన్న ఇంకో ఎకరం భూమి సాయన్న తన పేరిట ఉంచుకున్నాడు. ట్రాక్టర్ నడుపుకుంటూ పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఉంటున్న సాయన్న కుమారుడు వెంకటయ్య తన చెల్లెలికి భూమి ఇవ్వడం ఇష్టంలేక బావపై కక్ష పెంచుకున్నాడు.

నాలుగు రోజుల క్రితం పిలిపించుకుని..



ఆంజనేయులు (ఫైల్)

వెంకటయ్య నాలుగు రోజుల క్రితం ఆంజనేయులును అంగడిపేటకు రప్పించుకున్నాడు. పూటుగా మద్యం తాపించి శుక్రవారం సుత్తెతో మోది అంజనేయులును దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఆంజనేయులు మృతదేహాన్ని బస్తాలో కట్టి శుక్రవారం రాత్రి అంగడిపేట సమీపంలోని ఏఎమ్మార్పీ కాలువ పక్కన వేశాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దారుణం వెలుగులోకి వచ్చింది. దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, కొండమల్లేపల్లి సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. అంజనేయులు భార్య పారిజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ



ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న పీసీబీ జిల్లా ఈఈ సురేష్, దివీస్ డైరెక్టర్ దివిరావు

చౌటుప్పల్: ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, ప్రజలు తమవంతుగా సహకరించాలని పీసీబీ జిల్లా ఈఈ సురేష్, దివీస్ డైరెక్టర్ దివిరావు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం అంకిరెడ్డిగూడెంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా వారు స్థానిక సర్పంచ్ ముద్దం సుమిత్రసత్తయ్యతో కలిసి రహదారుల వెంట ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. తడి, పొడి చెత్త సేకరణ కోసం డ్రమ్ములను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివీస్ జనరల్ మేనేజర్‌లు పెండ్యాల సుధాకర్, బాలకిషోర్, సాంబశివరావు, రాఘవేందర్‌రావు, సీనియర్ మేనేజర్‌లు శివప్రసాద్, నర్సయ్య, సీఎస్సార్ ఇన్‌చార్జ్ వల్లూరి వెంకటరాజు తదితరులున్నారు.

మాదిగలకు ఎమ్మెల్యే కిషోర్ క్షమాపణ చెప్పాలి



అఖిలపక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న మంద కృష్ణమాదిగ, వివిధ పార్టీల నాయకులు

- మా కన్నును మా వేలితోనే పొడిపిస్తున్నాడు
- 9 మండలాల్లో మాదిగలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తిరుమలగిరి(తుంగతుర్తి): తుంగతుర్తి నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలు జరుగుతున్నాయని, ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఎమ్మెల్యే కిషోర్ మాదిగల పైనే దాడులు జరుపుతున్నాడన్నారు. గత నెల 19న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మాట్లాడిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, తన తప్పును ఒప్పుకొని మాదిగలకు, ఇతర పార్టీల నాయకులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమలగిరిలో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో మంద కృష్ణమాదిగ మాట్లాడారు. ఎమ్మెల్యే కిషోర్ ఎమ్మార్పీఎస్ నా కొడుకులు అనడంతో మాదిగలు, ఉప కులాల ప్రజల హృదయాలు గాయపడ్డాయన్నారు. కిషోర్‌ను మాదిగలకు శత్రువుగానే పరిగణిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. ఎమ్మెల్యే కిషోర్‌చే క్షమాపణ చెప్పిస్తాడో, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ నిరాకరిస్తాడో తేల్చుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రే దళిత బంధులో అవినీతి చోటు చేసుకుందని చెప్పారని గుర్తుచేశారు. దళిత బంధులో అవినీతికి పాల్పడిన వారి లిస్టు బయట పెట్టాలన్నారు. గతంలో కూడా మాదిగ బిడ్డలైన పాల్వాయి నగేష్, మల్లెపాక సాయిబాబా, అడ్వకేట్ యుగేంధర్‌లపై భౌతిక దాడులు చేయించాడని ఆరోపించారు. వీరిపై కూడా మాదిగలతోనే దాడులు చేయిస్తున్నాడని, మా కన్నును మా వేలితోనే పొడిపిస్తున్నాడని విమర్శించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గ ఉప కులాల ప్రజలు 80 శాతం ఉన్నారని, అన్ని పార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకే టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ, వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకులతో మాట్లాడి మాదిగలకు టిక్కెట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. కేసీఆర్ మంత్రి వర్గంలో ఒక్క మాదిగ మంత్రి కూడా లేడని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో మాదిగలే ఎక్కువగా చనిపోయారని తెలిపారు. నియోజకవర్గంలోని 9 మండలాల్లో మాదిగలతో త్వరలో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమయ్య, వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, నాయకులు ధీన్‌దయాళ్, కందుకూరి శ్రీను, అబ్బాస్, శ్రీనునాయక్, బోడ సునీల్, బొజ్జ సైదులు, మల్లెపాక సాయిబాబా, పేరాల వీరేష్, రాం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

నాగార్జునసాగర్: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. నాగార్జునసాగర్, వేములపల్లి, మోటకొండూర్, నూతనకల్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్లనుంచి హాలియాకు వెళుతున్న అశోక్‌లీలాండ్ ట్రాలీ ఆటో హిల్‌కాలనీలోని విజయవిహార్ సమీపంలోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద సపావట్ దీప్లానాయక్(40)బైకు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ప్రమాదంలో దీప్లాకు గాయాలయ్యాయి. పోలీసులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. దీప్లా భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

లారీని ఢీకొని..

వేములపల్లి : చివ్వెంల మండలం రాజ్యానాయక్ తండాకు చెందిన నరేష్ వేములపల్లి నుంచి మిర్యాలగూడకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అటు వైపే వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరేష్‌కు తీవ్ర గాయాలు కాగా మిర్యాలగూడకు తరలించారు.

క్షతగాత్రుడికి ఎమ్మెల్యే సాయం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సాయం చేశారు. వేములపల్లి మండల కేంద్రంలో రైతు దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మిర్యాలగూడకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదాన్ని గుర్తించి కారు దిగి క్షతగాత్రుడు నరేష్‌ను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నరేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు.

కారు ఢీకొని..

మోటకొండూర్: మండలంలోని ముత్తిరెడ్డిగూడెం –కొండాపూర్ గ్రామాల మధ్య శనివారం సాయంత్రం నిలిచున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొట్టగా ఇద్దరికి గాయాలయ్యాయి. ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ప్రశాంత్, వెంకటయ్య మోత్కూర్–రాయిగిరి రోడ్డు పక్కన తమ ద్విచక్ర వాహనాన్ని నిలిపారు. కాగా ఆత్మకూరు(ఎం) వ్యవసాయ అధికారిని శిల్ప తన కారులో ఆత్మకూర్(ఎం) నుంచి భువనగిరి వైపునకు వస్తుండగా ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



నాగరాణి (ఫైల్)

మేళ్లచెరువు : ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేళ్లచెరువు మండలంలోని రేవూరులో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేవూరు గ్రామానికి చెందిన నాగరాణి(23) అదే గ్రామానికి చెందిన జూనే బోయిన లక్ష్మణ్‌తో ఆరు సంత్సరాల క్రితం వివాహం జరిగింది. కాగా ఇరువురు తరచూ కట్నం కోసం గొడవపడుతూ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు కూడా జరిగాయి. ఈ నెల 1వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో భర్త లక్ష్మణ్ అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో నాగరాణి అన్న వెంకట శ్రీను అక్కడకు వెళ్లి చెల్లిని పుట్టింటికి తీసుకుపోయాడు. రెండవ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో నాగరాణి తిరిగి భర్త ఇంటికి తిరిగి వచ్చింది. మళ్లీ భర్త వేధించడంతో అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, శ్రీను చెల్లి యోగక్షేమాలు తెలుసుకునేందుకు ఇంటికి రాగా అప్పటికే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చందంపేట : విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. ఈ ఘటన నేరెడుగొమ్ము మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శిరసనమోని ఆంజనేయులుకు చెందిన పాడి ఆవు మేత కోసం వెళ్లగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మత్యువాతపడింది. దీని విలువ రూ.40వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

దేశానికి అన్నం పెడుతున్న తెలంగాణ

- రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

భువనగిరిటౌన్: వరి ధాన్యంలో తెలంగాణ అధిక దిగుబడి సాధించి దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని బొల్లేపల్లి రైతువేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, ఇతర రంగాల ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలో తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బూరు బీరుమల్లయ్య, మండల కన్వీనర్ కంచి మల్లయ్య, సర్పంచ్ మద్ది బుచ్చిరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా రాయగిరి రైతు వేదికలో జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం తర్వాత వ్యవసాయ రంగం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. న్యాయ సేవాధికారిత సంస్థ కార్యదర్శి మురళీమోహన్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు పడుతున్నా తనకు దరఖాస్తు చేసుకుంటే వారికి న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ రావు, మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, అనిల్‌కుమార్, ఎడ్ల రాజేందర్‌రెడ్డి పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ముత్తిరెడ్డిగూడెం రైతు వేదికలో ఎంపీపీ నరాల నిర్మల, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జైలుకు రైతుల తరలింపు

భువనగిరిటౌన్ : భద్రతా కారణాల దృష్ట్యా నలుగురు రైతులను శనివారం భువనగిరి సబ్ జైలు నుంచి నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు. గత నెల 29వ తేదీన కలెక్టరేట్ వద్ద రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని రైతులు 48 గంటల పాటు ఆందోళన చేపట్టారు. రైతులు యాదగిరి, బాలనర్సింహ, మల్లేష్‌గౌడ్, నిఖిల్‌ను నాన్‌బెయిల్‌బుల్ కేసు పెట్టి జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రైతులను పరామర్శించేందుకు భువనగిరి సబ్‌జైలుకు వివిధ పార్టీల నాయకులు, రైతులు, పెద్ద ఎత్తున్న వస్తున్న నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా నల్లగొండ జిల్లా జైలుకు తరలించారు.